


ఏమివాయ్ వెంకటేశం. ఎక్కడికి చెంగుచెంగున లేడి పిల్లలా గెంతులు వేస్తూ బయల్దేరావు?....వాట్ !! పిక్చరుకా? దేనికీ-?కొంటుసినిమాకా. అంటే తెలుగు పిక్చరనేగా నీ తాత్పర్యం! మనవూరి టెంటుసినిమాలో తెలుగు పిక్చర్స్ కాక మరేవిఁ టాడుతాయిలే.

హారి నీ యిల్లు బంగారంగానూ. నీకు బ్యూటిఫుల్ యంగ్ విడోతో మారియేజ్ కానూ. ఎంత ఒఘాయిత్యాని కొడిగట్టావు. కాస్తలో ఎంత ప్రమాదం జరిగేది. గిరీశఁ వంతవాడి శిష్యుడవై తెలుగు పిక్చరు—అదీ డబ్బు ఖర్చు

పెట్టి చూస్తావుటోయ్. ఇన్సల్ట్. అసలు తెలుగు పిక్చర్లెందుకూ? మన అధోగతిని పట్టుకు తిట్టిపోసుగోడానిగ్గాపోతే. మనం కూడా డబ్బు పెడితే ఈ పిక్చర్లు ఇహా నీ జన్మకి బాగుపడవు. అదిన్నీగాక, మదరిల్లా ఆశపడుతున్నట్టు ఆవిడ మాట చలవని నువ్వు రేపొద్దున్న పరీక్ష యిచ్చి ఏ కనిష్టీపువో, సర్కిలువో అయితే ఊరికినే చూడొచ్చు. అదృష్టం నీకూ నాకూ కూడా జాస్తిగా ఉండి, నాకు బ్రదర్లాగే అయే యోగం పడితే ఇహా చెప్పాలా. అప్పుడు నే నెలాగా లీడింగ్ ప్రొడ్యూసరు డైరెక్టరాక్టరు నౌతానుగదా.

అప్పుడు—

—వింటున్నారా వదినా! అప్పుడు మీరూ నేనూ మన ప్రయివేటు ఆడిటోరియంలో కూర్చుంటాం. అంటే మన సొంత సినిమాహాలన్నమాట. కేవలం మనకోసవేఁ పిక్చరాడుకుంటావన్నమాట. మన వెనకే ప్రొజెక్టరు. మన వెంకటేశవేఁ దాన్ని ఆపరేట్ చేస్తాడు .... జానొను వెళ్ళి రండి. పోపు మాడిపోతే ఆనక మీనాన్న వెంకటేశం మాడూడకొడతాడు మఝన—

ఊఁ. ఏవిటోయ్ వెంకటేశం. అయితే సినిమా కెళ్తానంటావు. ఎందుకు. నా మాట విని ఆడబ్బలా తగలెయ్యక ఇలా తగలెయ్యి. సిగార్సుకి కాపర్స్ అవసరమవుతాయి. వాటికి తగలేదాం. చూశావూ ఆ తగలేసేదికూడా సరైన పద్ధతిలో తగలెయ్యాలి. ఇలా కూచో చెబుతా. నువ్వైతే మహా సినిమా చూడాలని ఎగబడుతున్నావుగాని ఆ తీసే

వాళ్ళకి ఏఁవి జేహద్బీగా ఉందో తెలుసా? నువ్వూ నేనూ అసలు సినిమాలు చూసిందికి పనికిరాఁవుట. మనఁవిచ్చే డబ్బులు వాళ్ళ కసలు కలికంలోకి రాఁవుష. మనం క్లాసువాళ్ళంట. మనకి ఆ యోగ్యతా లేదుషమరి.

ఏమాటకామాటే అనుకోవాలి ఆ మాటా నిజవేఁ. మర్నేనూ రేపొద్దుట్నుంచి ప్రొఫెస్యాసర్ డైరెక్టర్నవుతున్నానుగదా.

సినిమా చూసే అర్హత నీకుందా అని. కలికాలం గాపోతే పెతీవాడూ సినిమా చూస్తాననె ఎగబట్టవేనా?

చూడొచ్చింది చాలక అడ్డుప్రశ్నలొకటా. డుయునో వెంకటేశం? మీ ఆడియన్సు సగటువయస్సు పన్నెండేళ్ళనీ, బుర్ర అంతకు మించి ఎదగరాదనీను? పాతికేళ్ళ నించి అదంతేనని మేవంతా నమ్ముతుంటే, ఇవాల్టిరోజున మీరు కాదు-వయసు పెరిగిందంటే చెల్లుతుందా? చెప్పు. చెల్లదు. ఔనా? అలాంటప్పుడు పెద్దంత్రం చిన్నంత్రం లేకుండా మీరు-మీ ప్రజలు-మమ్మల్ని విమర్శిస్తే యెలా.

ఈమధ్య ప్రతివాడూ మన పిక్చర్లలో వాగుడెక్కువై పోయిందంటున్నాడు. డైలాగులన్నీ ఉపన్యాసాలలా ఉండటవేఁ కాక,అవి చాలవన్నట్టు మళ్ళీ పిక్చరు చివర 'ఫలానారావు మెమోరియల్ లెక్చరు' అన్నట్టుగా నికార్సైన లెక్చర్లు ఏర్పాటుచేసేస్తున్నారనిన్నీ-కన్నాంబ లేకపోతే హీరోయినో ఎవరో ఒకళ్లు పుంజుకొని చెవులు హోరెత్తించేస్తున్నారనీ విమర్శిస్తున్నారు. బట్ వాడ్డుయు

నో! ఆ లెక్చర్లే తమిళంలో అక్షర లక్షలు రూపాయిలు కురిపించాయి. వాటికోసం జనం విరగబడి చూశారు. మజాకా అనుకున్నావా లెక్చరంటే.

ముందర డబ్బింగుసినిమాలద్వారా శాంపుల్ చూసి మీకు నచ్చాయని పసిగట్టిగదా ఇపుడు ధారాళంగా ఏర్పాటు చేస్తున్నాం. పైపెచ్చు సినిమాఅంతా ఐపోయినా కథలో పాయింటేమిటో పట్టుకోలేనివాళ్లు కొన్ని లక్షలమంది ఉంటారు. లెక్చర్ల ద్వారా వారికి కథనుజ్ఞాపకం చేసి అబ్బీ నువ్వు దీని ద్వారా గ్రహించిన నీతి ఇదిసుమీ అని ఢంకా బజాయించినట్టు చెప్పిందికి సదుపాయంగా ఉంటుంది.

* * *

పొడుగు డైలాగులేనా అంతే. రెడ్డొచ్చెనని మొదలాడడం సినిమాలో సాధ్యపడ్డంలేదుగదా, అంచేత ఖాలా ఆలీసెంగా వచ్చేవాళ్లు మళ్ళీ జరిగినకథ చెప్పమని పక్కవాళ్ళ ప్రాణాలు తోడీకుండా మేమే పావుగంటకోసారి జరిగినకథ టూకీగా డైలాగులో చెప్పిస్తున్నాం. ఇది మీ ప్రజల మేలుకోరే. అంతేకాని. మీలో కొందరు గిట్టని వాళ్లు ఆడిపోసుకుంటున్నట్టు ఇంటర్వెల్ దాకా పాత్రలనీ కథనీ ఎస్టాబ్లిష్ చెయ్యడం చాతకాక కాదు. చాతకాపోయినా మీరుఇలా మంచి భావంతోనే ఎందుకు అర్థం చేసుకోరాదు?

అదిగో ఆ పొడుగోటి. ప్రతి అడ్డమైనవాడూ తెలుగు పిక్చర్లు పొడుగోయ్ అని ఆడిపోసుగోడమే. అలా అని అనే చివరికి దిష్టితగిలి ఆపొడుగూ చిక్కి సగమైపోయింది.

పూర్వం పాతిక ముప్ఫైవేలుండే ఫిలిములన్నీ పదిహే నిరవైవేలకి తగ్గిపోయాయి. అయినా ఆ మురార్జీ దేశాయి వారికింకా ఇందుమీదేదృష్టి; ఫిలిమ్మీద పన్నేస్తే పొడుగు తగ్గుతుందనీ, అది తగ్గితే ఇహ ప్రెసిడెంటు ఎవార్డు విన్నర్ క్లాసిక్కు కుప్పతిప్పలుగా వస్తాయనీ ఆయన దురాశ.

ముతకసామెత జెప్పినట్టుంది. ఒక దేవత, నెత్తిన కాలెట్టిన నాస్తికుడి నేవంనలేక భక్తుడిని భయపెట్టిందిట— వాడికి భయం జెప్పి ఆ కాలుతీయించి తగిలేస్తావా లేదా అని. అలా వుంది, మురార్జీగారి పథకం.

ఒకటి చెబుతావిను వెంకటేశం. పొడుగు తగ్గిస్తే సినిమాలు బాగుపడతాయనుకోడం వుట్టి భ్రమ. అయ్యో ఉన్నదే పదివేల అడుగులని డబ్బురావడానికి మరి నాలుగు డాన్సులు, రెండర్థాల మాటలూ పెట్టేసి జాగర్త పడతారు తెలివైనవాళ్లంతా. మళ్ళీ ఆనక సెన్సారువాళ్ల మూలంగా కత్తెర్లకి డిమాంఁడు పెరగడం, వాటిమీద ఇంపోర్టు కంట్రోళ్ళూ, రోకళ్లూ దానికి ఉద్యమాలూ గట్రా వస్తాయి. ఎందుకొచ్చిన రభస—

